క్లుప్తంగా

రూ.93 వేల ఆర్థికసాయం



విద్యార్థి తల్లిదండ్రులకు డబ్బులు అందజేస్తున్న ఎంపీపీ మురళి, తదితరులు

నరసన్నపేట: మండలంలోని దూకులపాడుకు చెందిన కల్లేపల్లి సింహాచలం కుమారుడు యోగేశ్వరరావు బ్రైన్ ట్యూమర్‌తో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సత్యవరం గ్రామానికి చెందినవారితోపాటు ఇతరుల నుంచి వాట్సాప్ ద్వారా వివరాల రూపంలో రూ.93 వేలను సేకరించారు. ఈ మొత్తాన్ని ఎంపీపీ ఆరంగి మురళి ఆదివారం విశాఖ వెళ్లి విద్యార్థి కుటుంబ సభ్యులకు అందించారు. సత్యవరానికి చెందిన నీలం రాజు, వాసుదేవరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

రూ.11,700 ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన ఆచంటి ఉమామహేశ్వరరావుకు తోటి స్నేహితులు, పూర్వ విద్యార్థులు రూ.11,700 ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవలన జరిగిన బైక్ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు కుడి కాలు విరిగింది. ఈ ఆదివారం అన్నంపేట గ్రామానికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు.

సందడిగా పిక్నిక్



డ్యాన్స్ చేస్తున్న మహిళలు

నరసన్నపేట: స్థానిక జీసీ హోమ్ తోటలో ఆదివారం శిష్టకరణాల పిక్నిక్ నిర్వహించారు. నరసన్నపేట పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన శిష్టకరణాలు పిక్నిక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హాజరైన మహిళలకు వివిధ క్రీడలను నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, సంఘం ప్రతినిధులు ఉరిటి రాధాకృష్ణ, ఉరిటి కిరణ్, ఎంవీజే మోహన్‌రావు, అంపలాం వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి

ఆమదాలవలస: దేశాభివృద్ధి కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న మహోన్నతమైన వ్యక్తి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, మాజీ ఎంపీపీ, ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేపల్లి గోవింద గోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో రహదారి ఏర్పాటు



కొండపై ఉన్న ఆశోకం గ్రామానికి నిర్మించిన సిమెంట్ రోడ్డు

సారవకోట: మండలంలోని గుమ్మపాడు పంచాయతీ కొండపై ఉన్న ఆశోకం గ్రామానికి రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఐటీడీఏ అధికారులతో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడి ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. భూ ఉపరితలం నుంచి 1,200 మీటర్ల పొడవు గల రహదారిని నిర్మించారు. ఇప్పటివరకు ఆ గ్రామానికి రోడ్డు మార్గం లేక అక్కడి గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐటీడీఏ నుంచి నిధులు మంజూరై పనులు చేపట్టడంతో రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ధర్మాన ప్రసాదరావు మంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ సౌకర్యం కల్పించారని, ప్రస్తుతం ఆయన సోదరుడు కృష్ణదాస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రోడ్డు నిర్మించారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గడపగడపకూ సంక్షేమం



కొండపోలవలసలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని, ఇంకా అర్హత ఉంటే వారికి కూడా పథకాలు అందించడమే గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కొండపోలవలస పంచాయతీలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు జగనన్నను దీవించి సీఎంను చేయాలని కోరారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన గోపి, టీఎస్ఆర్ మూర్తి, కొర్ను గడ్డయ్య, బి.రమణమూర్తి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గడపగడపకు నిధులతో వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటి పట్టాలు, పింఛన్లు మంజూ చేయాలని పి.జ్యోతి, పల్లి కామేశ్వరి, కత్తిరి చిట్టమ్మ కోరారు. ఈ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్, ఎంపీడీఓలకు ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షుడు పి.రాజప్పలనాయడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, పి.పిజయ్, మాజీ ఎంపీటీసీ వాన శ్రీనివాసరావు, ముసలినాయుడు, బగ్గు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయి వీర వనిత



ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: స్వాతంత్ర్య సంగ్రామంలో మొదటిగా బ్రిటీష్ వారి పోరాడిన వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి అని మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన అన్నారు. పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్రపై వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



పాతపట్నం: మాట్లాడుతున్న సాహితీ వేదిక కార్యదర్శి చంద్రశేఖర్

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయం ఆవరణలో ముగ్గుల పోటీలను లైబ్రేరియన్ సాయమ్మ నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి బహుమతులు అందజేయనున్నారు.

కొత్తూరు: కొత్తూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మాజీ ప్రధాని మంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఇందిరా గాంధీ దేశం కోసం చేసిన సేవలను విశ్రాంత ఉపాధ్యాయులు, సర్పంచ్ పడాల కృష్ణవేణి వివరించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలను గ్రంథాలయాధికారి తెంబూరి ఇందిర నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. సీసీ జ్యోతి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నం: గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగులతోపాటు ప్రతి ఒక్కరూ సద్వినియోగించాలని సాహితీ వేదిక అధ్యక్షుడు బందన శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక సదస్సు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సాహితీ వేదిక కార్యదర్శి పూతిక చంద్రశేఖర్, హెచ్ఎం రామ్మూర్తి, గ్రంథాలయాధికారి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సారవకోట: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కొత్తూరు: ముగ్గులను పరిశీలస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

నేడు యంబరాంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఎల్.ఎన్.పేట: మండలంలోని యంబరాం గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి అన్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొంటారన్నారు. మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

వివాహిత అదృశ్యం

సారవకోట: మండలంలోని తర్లి గ్రామానికి చెందిన వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త ఆదివారం సారవకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన ఆమె ఇంటికి చేరలేదన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్దకూడా ఆచూకీ లభించలేదన్నారు. దీనిపై హెచ్‌సీ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

పొందూరు: జీపీఎస్ విధానంవద్దని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. స్థానిక ఒకటో నెంబర్ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ సర్వసభ్య సమావేశాన్ని మండల శాఖ అధ్యక్షుడు మొగదాల రమణరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, జిల్లా కార్యదర్శిలు డి.వీరయ్య, పి.లక్ష్మణరావు, ఎం.గంగేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్లు విజయకుమార్, బొంతు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జుంబా డ్యాన్స్‌తో శారీరక దృఢత్వం

శ్రీకాకుళం అర్బన్: సంపూర్ణ ఆరోగ్యానికి, మానసికంగా ఫిట్‌గా ఉండేందుకు, శారీరక దృఢత్వానికి జుంబా డ్యాన్స్ దోహదపడుతోందని స్టార్‌వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన జుంబా డ్యాన్స్ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, కూన వెంకటరమణమూర్తి, గుడ్ల సత్యన్నారాయణ, పిజి గుప్తా పాల్గొన్నారు. నృత్యం, సంగీతం మన మానసిక స్థితిని మెరుగు పరిచే సాధనాలన్నారు. మనిషి ఒత్తిడిని జయించే శక్తిని జుంబా డ్యాన్స్ ఇస్తుందన్నారు.

పాతపట్నం నుంచి కాకినాడకు బస్ సౌకర్యం



పాతపట్నం నుంచి కాకినాడకు బయలు దేరుతున్న ఆర్టీసీ బస్సు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నుంచి కాకినాడ వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్ సౌకర్యాని ప్రతీరోజు రెండు బస్సులను ఆర్టీసీ అధికారులు కల్పించారు. ఇటీవల పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆర్టీసీ ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. పాతపట్నం నుంచి విశాఖపట్నం, సింహాచలం, అన్నవరం మీదుగా కాకినాడకు భక్తులు వెళ్లేందుకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఎంతో ఉపయోగపతుందన్నారు. సింహాచలం, అన్నవరం తీర్థయాత్రలకు ఈ బస్సు ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీరోజు పాతపట్నం ఆర్టీసీ కాంపెక్స్‌లో ఉదయం 9 గంటలకు, మళ్లీ రాత్రి 8.30గంటలకు ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. పాతపట్నంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొరసవాడ కొండపై పులి సంచారం



కొరసవాడ, శివరాంపురం గ్రామస్తులకు వినతిపత్రం అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామానికి అనుకుని ఉన్న కొండపై పెద్దపులి వెళ్లిన పాదముద్రలు కనిపించాయని కొరసవాడ, శివరాంపురం గ్రామస్తులు అన్నారు. ఆయా గ్రామాల సమీపంలోని పంట పొలాల్లో పెద్దపులి పాద ముద్రలను ఆదివారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఉదయం నుంచి కొరసవాడ కొండ చుట్టూ అటవీశాఖ అధికారులు పహారా కాస్తున్నారు. కొరసవాడ, శివరాంపురం, బూరగాం గ్రామస్తులు సాయంత్రమైతే బయటికి రాకుండా ఉండాలని, రాత్రి వేళల్లో పంట పొలాలకు నీరు కట్టేందుకు వెళ్లే రైతులు కొద్ది రోజులు మానుకోవాలన్నారు. పులి జాడ కనిపిస్తే వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించాలన్నారు. రైతులు, గిరిజనులు తెల్లవారు జామున పంట పొలాలవైపు, కొండ పరిసరాల ప్రాంతాల వైపు వెళ్లవద్దన్నారు. ఆయా గ్రామస్తులకు ఫారెస్ట్ సెక్షన్ అధికారి పి.యశస్వి, ఫీబీఓ కె.ఉమామహేశ్వరరావు, ప్రవీణ్ వినతిపత్రం అందజేశారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు

కొత్తూరు: యూటీఎఫ్ కొత్తూరు మండలశాఖ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం మండలంలోని మహర్తాపురం కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఏకగ్రీవంగా జరిగిందని ఎన్నికల పరిశీలకులు పొందూరు అప్పారావు తెలిపారు. యూటీఎఫ్ కొత్తూరు మండల కౌన్సిల్ సమావేశాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పొందూరు అప్పారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అప్పారావుతోపాటు పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయకుండా జీపీఎస్ తీసుకురావడం సరికాదన్నారు.

నూతన కమిటీ ఎన్నిక...

యూటీఎఫ్ కొత్తూరు మండలశాఖ అధ్యక్షుడిగా ఎ.శోభన్‌బాబు, గౌరవ అధ్యక్షుడిగా ఎం.మాధవరావు, సహ అధ్యక్షులుగా బడి స్వర్ణలత, ఎ.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కె.విజయ్‌కుమార్, కోశాధికారిగా బి.వీరభద్రయ్య, జిల్లా కౌన్సిలర్‌గా దండు ప్రకాశరావు, బోడ శ్రీనివాసరావు, ఆర్ఆర్ ఎం.కొండలరావు, సంతోష్, సురేష్, గణపతిరావు, బి.నాగయ్య శోభన్‌బాబు, కె.విజయకుమార్‌తోపాటు 11 మంది కార్యదర్శులు, పలు విభాగాలకు కన్వీనర్లను ఎన్నుకున్నారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న మహిళా విభాగ సభ్యులు

నరసన్నపేట: స్థానిక చిత్తిరి వీధిలోని సత్యసాయి మందిరంలో గర్భిణులకు ఆదివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సాయిబాబా తల్లి ఈశ్వరమ్మ జయంతి సందర్భంగా సామూహిక సీమంతాలు చేపట్టారు. సత్యసాయి మందిరం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో వి.రోజా తదితరులు పాల్గొన్నారు. అలాగే మందిరంలో వృద్ధులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్కుపురంలో..

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామంలో సత్యసాయి మందిరంలో ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో ఆదివారం పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చీరలు, పండ్లు, మిఠాయి అందజేశారు. గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. సాయి భక్తులు పాల్గొన్నారు.



బూర్జ: గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఎంపీపీ కర్నేన దీప



నరసన్నపేట: ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్‌ను చూస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, తదితరులు

వరల్డ్ కప్ సందడి

వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు అభిమానులు టీవీలు, మినీ తెరుల వద్ద హత్తుకుపోయారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ ప్రారంభమైంది. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ చిన్నారులు, యువత సందడి చేశారు.



మెళియాపుట్టి: హీరాపురంలో బిగ్ స్క్రీన్ పై వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను చూస్తున్న యువత



పాతపట్నం: పాతపట్నం కేఎస్ఎం ప్లాజా ఆవరణలో మ్యాచ్‌ను తిలకిస్తున్న దృశ్యం



హిరమండలం: సుభలయ స్కూల్‌లో మ్యాచ్‌ను వీక్షిస్తున్న యువత, గ్రామస్తులు